సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



పకడ్బందీ ఏర్పాట్లు
సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. - 8లో



లోకల్ టు గ్లోబల్
తుంగతుర్తికి చెందిన కీర్తి శ్రీనివాస్‌గౌడ్ జానకి దంపతులు స్వచ్ఛమైన గానుగ నూనె తయారుచేసి అందిస్తున్నారు. - 8లో



సబ్సిడీ సిలిండర్లు పక్కదారి
టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ పాయింట్లలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. - 9లో

న్యూస్‌రీల్

నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్

భువనగిరి : జిల్లాలో కోతలు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు భువనగిరి డీఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సమస్యను అధిగమించేందుకు ఓవర్ లోడ్ పడుతున్న 101 ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, అదనంగా 95 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో అదనంగా రీపవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయానికి కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. సరఫరాలో అంతరాయం ఏర్పడినా, లైన్లలో సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలపై సెల్ నంబర్ 9491065938ను సంప్రదించాలని కోరారు.

'స్వర్ణగిరి'లో న్యాయ విజ్ఞాన సదస్సు స్టాళ్లు



కరపత్రాలను అందజేస్తున్న జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు స్టాళ్లను శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, జిల్లా కోర్టు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయ సేవాధికార సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయం పొందడానికి న్యాయ సేవాధికార సంస్థ సలహాలు ఇస్తుందన్నారు. ఉచిత న్యాయ సేవల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శంకర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజంలో చైతన్యం



'నెరుసు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : సమాజాన్ని చైతన్య పరచడానికి సాహిత్యం దోహదపడుతుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య రాసిన సాహిత్య వ్యాససంపుటి నెరుసు పుస్తకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. సాహితీరంగంలో దిగ్గజాలైన కవులు, రచయితల రచనలపై విమర్శనాత్మకమైన వ్యాసాలు రాసి కృష్ణకౌండిన్య సాహితీరంగంలో తనదైన ముద్రవేశారని కొనియాడారు. నెరుసు అంటే కత్తిని పదును పెట్టడానికి ఉపయోగించే గుళిక రాళ్లపొడి అని, వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన వ్యాససంపుటిని నెరుసు పేరుతో పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ తండు క్రిష్ణకౌండిన్య , కూరెళ్ల గ్రంథాలయం గ్రంథపాలకుడు తాటిపాముల స్వామి, జువ్వగోని మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కుల జిల్లా చైర్మన్‌గా యాదగిరి



నియామక పత్రం అందుకుంటున్న చైర్మన్ కురుమేటి యాదగిరి

మోత్కూరు : జాతీయ మానవ హక్కుల జిల్లా చైర్మన్‌గా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన కురుమేటి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కోల మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ చైర్మన్ సంపత్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో వారిని చైర్మన్, ప్రధాన కార్యదర్శి పదవుల్లో నియమించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ హక్కులకు సంబంధించిన సహకారం అందజేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రధానాలయ ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

నమో నారసింహ

నేడు యాదగిరిగుట్ట ఆలయ స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణ

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- భారీ పోలీసు బందోబస్తు
- కాంతులీనుతున్న ప్రధానాలయం

యాదగిరిగుట్ట : యాదగిరీశుడి క్షేత్రం స్వర్ణకాంతులతో కనువిందు చేయనుంది. బంగారు తాపడంతో రూపుదిద్దుకున్న దివ్య విమాన గోపురాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. అడుగడుగునా స్వామి, అమ్మవారి చిత్రాలు, భారీ స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాల అలంకరణతో ప్రధానాలయంతో పాటు ఆలయ పరిసరాలు మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

భక్తిభావం పెంపొందించేలా ఏర్పాట్లు

మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం ప్రపంచమంతా తెలిసేలా దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. భక్తిభావం మరింత పెంపొందించేలా, ఆధ్యాత్మిక చింతన కలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. పట్టణంలో నిత్యం శ్రీస్వామి వారి కీర్తనలు వినిపించేలా మైక్‌లు ఏర్పాటు చేశారు. బస్టాండ్ నుంచి రింగ్ రోడ్డు, కొండపైన ఎటు చూసిన ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా దేవతామూర్తుల చిత్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలు, కొండ కింద పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల పూలు, అరటి, మామిడి తోరణాలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు.



విమానగోపురం వద్దకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్లతో కూడిన నిచ్చెన

వాహనాలకు నో ఎంట్రీ

సీఎంతో పాటు ప్రముఖులు వెళ్లే వరకు కొండపైకి వాహనాలకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. కొండ కింద పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలిపి ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి వెళ్లాలని సూచించారు. ఉదయం నుంచి 25 బస్సులు నిత్యం కొండపైకి నడుస్తాయని అధికారులు వెల్లడించారు. విమాన గోపురం వద్దకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రముఖులు, అర్చకులు వెళ్లేందుకు మెట్లతో కూడిన ప్రత్యేక నిచ్చెన ఏర్పాటు చేశారు.

భక్తులకు ఉచిత ప్రసాదం

మహోత్సవానికి ఎంత మంది భక్తులు వచ్చిన ఉచితంగా పంపిణీ చేసేందుకు పులిహోర తయారు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక శ్రీస్వామి వారి స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణ, మహా కుంభాభిషేకాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా కొండపైన మాడ వీధుల్లో, కొండ కింద కమాన్ వద్ద, వ్రత మండపం వద్ద, ఇతర ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. విమాన గోపురానికి బంగారం తాపడానికి సహకరించిన దాతలు కూర్చోడానికి కొండపైన, తూర్పు మాడ వీధిలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈఓతో పాటు ఉన్నతాధికారులు పరిశీలించారు.

బంగారు కలశాల బిగింపు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ అష్టభుజి ప్రాకార మండపాలపై బంగారు కలశాలను శిల్పులు బిగించారు. గతంలో అష్టభుజి ప్రాకార మండపాలపై ఉన్న విమానాలతో పాటు వైకుంఠద్వారానికి రాగితో తయారు చేసిన కలశాలు ఏర్పాటు చేశారు. వీటి స్థానంలో ఇటీవల తయారు చేయించిన బంగారు కలశాలు బిగిస్తున్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో బంగారు కలశాలను బిగించారు.



సీఎం పర్యటన ఇలా..

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు యాదగిరిగుట్టలోని హెలిపాడ్ వద్ద దిగుతారు.
- హెలిపాడ్ నుంచి నేరుగా యాదగిరి కొండపైన గల అతిథిగృహానికి చేరుకుంటారు. సంప్రదాయ దుస్తులు ధరించి 11.25 గంటలకు యగశాలకు చేరుకుని మహా పూర్ణాహుతిలో పాల్గొంటారు.
- 12.15కు ఆలయ స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరిస్తారు.
- 12.45కు స్వయంభూలను దర్శించుకుంటారు.
- 12.50 నుంచి 1.30 వరకు అతిథిగృహంలో ఉంటారు. అక్కడ భోజనం చేసిన అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు.



రంగురంగుల విద్యుత్ లైట్లతో కనువిందు చేస్తున్న యాదగిరీశుడి ప్రధానాలయం, కొండపైకి వెళ్లే ఆర్చి

దివ్యాంగులకు శాశ్వత గుర్తింపు

- సదరం ధ్రువీకరణ పత్రాలకు స్వస్తి
- దేశ వ్యాప్తంగా ఒకే కార్డు విధానం
- దాని ప్రకారంగానే పింఛన్, సంక్షేమ పథకాల వర్తింపు
- మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి



యూడీఐడీ కార్డు నమూనా

భువనగిరి : దివ్యాంగులకు వైకల్య శాతాన్ని అనుసరించి ఇప్పటి వరకు జారీచేస్తున్న సదరం ధ్రువపత్రాలకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది. దేశ వ్యాప్తంగా ఒకే విధమైన గుర్తింపు కార్డు అమల్లోకి తీసుకురానుంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో యూడీఐడీ (యూనిఫై డిసెబుల్ ఐడెంటిటీ) కార్డు అందుబాటులో ఉండగా తెలంగాణలో మాత్రం సదరం సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్లు ఇతర రాష్ట్రాల్లో చెల్లుబాటు కాకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి 1నుంచి మన రాష్ట్రంలో కూడా యూడీఐడీ కార్డులు విధానం అమల్లోకి రానుంది. రానున్న రోజుల్లో యూడీఐడీ కార్డు ఉంటేనే దివ్యాంగులకు పింఛన్లు, సంక్షేమ పథకాలు వర్తించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న దివ్యాంగులు తప్పనిసరిగా యూడీఐడీ కార్డు వివరాలను తమ సర్వీస్ రికార్డుల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

నిర్ధారిత రంగుల్లో కార్డులు
వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగుల్లో యూడీఐడీ కార్డులను జారీ చేయనున్నారు. కార్డు ఒక్కసారి ఇస్తే మళ్లీ పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉండదు. బస్సులు, రైళ్లల్లో రాయితీతో పాటు దివ్యాంగులకు వర్తించే అన్ని సౌకర్యాలు యూడీఐడీ కార్డు ద్వారా పొందవచ్చు.

12,940 మంది దివ్యాంగులు
జిల్లా వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు 12,940 మంది ఉన్నారు. భవిష్యత్‌లో వీరందరూ వన్ నేషన్ వన్ డిసెబిలిటీ కింద యూడీఐడీ కార్డులు పొందాల్సి ఉంటుంది.

పాత పద్ధతిలోనే స్లాట్ బుకింగ్
యూడీఐడీ కార్డు కోసం ఎప్పటి మాదిరిగానే జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపునకు హాజరు కావాల్సి ఉంటుంది. ముందుగా మీ సేవ కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. అనంతరం నిర్దేశిత తేదీన సదరం క్యాంపునకు వెళ్లాలి. అక్కడ వైద్య పరీక్షల అనంతరం దరఖాస్తుదారుడి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దివ్యాంగుడి వివరాలు, వైకల్య శాతం వైద్యుల లాగిన్‌కు చేరుతుంది. వివరాలను పరిశీలించి అప్‌లోడ్ చేయగానే కార్డు మంజూరు అవుతుంది. జారీ చేసిన వ్యక్తి డిజిటల్ సంతకంతో కార్డు ఉంటుంది. దాని ప్రకారమే ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోంది.

యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి
దివ్యాంగులు మీ సేవలో యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెలాఖరులో స్లాట్ బుకింగ్ ముగుస్తుంది. సదరం ఎప్పటిలాగే కొనసాగుతుంది. యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసుకుంటేనే కార్డు వస్తుంది.
–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

- కలెక్టర్ హనుమంతరావు



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఉపాధ్యాయులకు సూచించారు. బీబీనగర్ మండలం పడమటిసోమారం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, వంటల నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. డిజిటల్ తరగతుల్లో తప్పనిసరిగా ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు బోధించాలని, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ స్కూళ్లకు రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలు
- పరీక్షకు 3,708 మంది విద్యార్థులు



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయుడు

భువనగిరి : 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5నుంచి 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3,708 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షల పర్యవేక్షణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు 14, డీఓలు 14, ఇన్విజిలేటర్లు 193 మందిని నియమించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది.

గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతి
విద్యార్థులను నిర్దేశిత సమయం కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డు, పరీక్ష ప్యాడ్ తెచ్చుకోవాలని భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు.

తెలంగాణ దశదిశను మార్చే ఎన్నికలు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

నల్లగొండ : రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ దశ దిశను మార్చేవని తెలంగాణ బీసీ ఇంటలెక్చువల్స్ పోరం రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రవర్ణాల జెండాలుగా మోసేవారుగా ఉన్నారని బీసీల ఓటు బీసీలకు వేసి గెలిపించడం వల్ల బీసీల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులంతా ఏకమై పూల రవీందర్‌ను గెలిపించాలని కోరారు. బహుజన వాదాన్ని గెలిపిస్తే భవిష్యత్‌లో బహుజనులు మంచి స్థానంలో ఉంటారన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, కొంపల్లి భిక్షపతి, నకిరెకంటి కాశయ్యగౌడ్, శ్యాంసుందర్, తిరందాసు రాందాస్, పెండెం శ్రీనివాసులు, మేడె రామకృష్ణ, సమీర్‌కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- డీఈఓ సత్యనారాయణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ

బొమ్మలరామారం : విద్యార్థులు పర్యావరణహితం కోసం భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. బొమ్మలరామారం మండలంలోని మల్యాల గ్రామంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో శనివారం మినీ సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంతో పాటు పలు ఎగ్జిబిట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. సైన్స్‌ఫెయిర్ నిర్వహణకు సహకరించిన జీఈవర్నోవా, యునైటెడ్ కంపెనీ ప్రతినిధులను డీఈఓ అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఎంఓ శ్రీనివాస్, జీసీడీఓ రాధ, డీఎస్‌ఓ రాజశేఖర్, ఎస్‌ఓ లక్ష్మి, జీహెచ్‌ఎం వరలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనెనా, సీఆర్‌పీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

నల్లగొండ : నల్లగొండలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సుల్లో 50 శాతం ఫీజు రాయితీతో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కో–ఆర్డినేటర్ ఎం.సరిత తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఎడ్యుకేషన్ కోర్సులు, కంప్యూటర్ బేసిక్స్, పీజీడీసీఏ, డీటీపీ కోర్సుల్లో శిక్షణ నిస్తామని పేర్కొన్నారు. విద్యార్థినులు, యువతులకు కంప్యూటర్, బ్యూటీషియన్, డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్‌టైల్స్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

హవనాలు.. నిత్య పూర్ణాహుతి

- యాదగిరి క్షేత్రంలో నాల్గో రోజు వైభవంగా పంచకుండాత్మక యాగం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు శనివారం ప్రధానాలయంలో నిత్యారాధనలు ముగిసిన అనంతరం శ్రీస్వామి, అమ్మవారిని తిరు, మాడ వీధుల్లో ఊరేగిస్తూ యాగశాలకు తీసుకువచ్చారు. అక్కడ చతుస్థానార్చనలు, విమాన అధిష్ఠాన పరివార విశేష హోమాలు, ఆ తరువాత 81 కలశాలను స్థాపన చేసి వాటిలో సమస్త దేవతలను ఆహ్వానించే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు చేపట్టి నిత్య పూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్ర పుష్ప పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన తదితర పూజలు గావించారు. నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి చేసి తిరువీధి సేవతో శ్రీస్వామి అమ్మవార్లను ఆలయంలోకి వేంచేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ హనుమంతరావు, దేవస్థానం భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, రుత్వికులు, అర్చకులు, పారాణీకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహాపూర్ణాహుతి.. శాంతి కల్యాణం
పంచకుండాత్మక యాగంలో చివరి రోజైన ఆదివారం ఉదయం మహా పూర్ణాహుతి, వేదశాత్తుమురై నిర్వహిస్తారు. అనంతరం 11.54 గంటలకు మూల నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో శ్రీస్వామివారి బంగారు విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం జరిపిస్తారు. ఆ తరువాత మహా రాజభోగ నివేదన, పెరియ శాత్తుమరై పూజలు చేస్తారు. సాయంత్రం 4గంటలకు శాంతికల్యాణం జరిపిస్తారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు : మహా కుంభాభిషేక సంప్రోక్షణ సందర్భంగా యాదగిరి కొండపై వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు కూచిపూడి నాట్యం ప్రదర్శించారు. స్వామి సన్నిధికి వచ్చిన భక్తులతో పాటు స్థానికులు సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న వానమామలై రామానుజ జీయర్ స్వామి



మహాకుంభాభిషేక సంప్రోక్షణ కలశం



యాదగిరికొండపై కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

టాటా ఏస్ బోల్తా.. వలస కూలీ మృతి

భువనగిరిటౌన్: టాటా ఏస్ వాహనం బోల్తా పడి వలస కూలీ మృతిచెందాడు. ఈ ఘటన శనివారం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై భువనగిరి పట్టణంలో జరిగింది. బిహార్ రాష్ట్రానికి చెందిన ముఖేష్, మరో ముగ్గురు కలిసి టాటా ఏస్ వాహనంలో సైడ్ వాల్ నిర్మాణం కోసం ఉపయోగించే సిమెంట్ బిల్లలు లోడుతో హైదరాబాద్‌లోని జీడిమెట్ల నుంచి భువనగిరి మండలం రాయిగిరికి వస్తున్నాడు. భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ముఖేష్ సైతం సడన్ బ్రేక్ వేశారు. దీంతో టాటా ఏస్ వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలోని సిమెంట్ బిల్లలు ముఖేష్ తలపైపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ముఖేష్‌తో పాటు టాటా ఏస్ వాహనంలో ప్రయాణిస్తున్న సుఖేష్, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చిట్యాల: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. తెలుపు, నీలం రంగు గీతలున్న టీషర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడు నాలుగైదు రోజులుగా చిట్యాలలోనే భిక్షాటన చేస్తూ గడిపినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోలీసులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వారం రోజుల్లో పెళ్లి.. యువకుడి బలవన్మరణం



మహేష్ (ఫైల్)

మోటకొండూర్: వారం రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోటకొండూర్ మండలం అమ్మనబోలులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. శనివారం ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన జటంగి మహేష్(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు మార్చి 2వ తేదీన మహేష్ వివాహం నిశ్చయించారు. కాగా శుక్రవారం రాత్రి మహేష్ తన ఇంట్లోని స్టోర్ రూంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత మహేష్ నాన్న కొమురయ్య గమనించి ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మహేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మహేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

లోకల్ టు గ్లోబల్!

ఎద్దు గానుగ నూనెకు పెరుగుతున్న డిమాండ్

- కేతేపల్లి మండలం తుంగతుర్తిలో తయారుచేస్తున్న దంపతులు
- నెలకు 450 కిలోల నూనె ఉత్పత్తి
- దేశ, విదేశాలకు సైతం ఎగుమతి



ఎగుమతికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల నూనెలు



ఎద్దు గానుగ తిప్పుతున్న శ్రీనివాస్

కేతేపల్లి: వంటకాల్లో వాడే నూనె కల్తీ అవుతుండడంతో ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన కీర్తి శ్రీనివాస్‌గౌడ్, జానకి దంపతులు జానకి నాచురల్ ఫామింగ్ పేరుతో స్వచ్ఛమైన గానుగ నూనె తయారుచేసి అందిస్తున్నారు. తొలుత తమ ఇంటి వరకే అనుకున్న వారు.. ప్రజలకు ఆరోగ్యపరంగా మేలు చేయాలనే లక్ష్యంతో విస్తరించి విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు.

అనారోగ్య సమస్యలు రావడంతో..

బైక్ మెకానిక్ అయిన శ్రీనివాస్ 25 ఏళ్ల కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నారు. 2020లో శ్రీనివాస్ జీర్ణాశయ సమస్యతో ఆస్పత్రిలో చేరారు. డాక్టర్లు సర్జరీ చేయడంతో మూడు నెలల పాటు మంచానికే పరిమితమయ్యాడు. ఆ తర్వాత స్వగ్రామం తుంగతుర్తికి వచ్చిన శ్రీనివాస్ తన అనారోగ్యానికి కల్తీ నూనె కారణమని తెలుసుకున్నాడు. దీంతో గానుగ ద్వారా తీసిన నూనె వాడాలని నిర్ణయానికి వచ్చాడు. సామాజిక మాధ్యమాల్లో శోధించి ఎద్దు గానుగ నూనె గురించి తెలుసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా జక్కపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ఖాదర్‌వలీ శిష్యుడు బసవరాజు వద్ద మూర్ఛ్రోజుల పాటు గానుగ నూనె తయారీలో శిక్షణ పొందాడు. అనంతరం గ్రామంలో తన కున్న ఎకరంన్నర భూమిలో రూ.6లక్షలతో ఎద్దుల గానుగ నూనె తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. కల్తీ లేని పల్లి, కొబ్బరి, కుసుమ, నువ్వులు, గడ్డి నువ్వులు, ఆముదాలతో నిత్యం 15కిలోల చొప్పున నెలకు 450కిలోల నూనె తయారుచేస్తున్నారు.

కేరళ, కర్ణాటక నుండి..

గానుగ ద్వారా నూనె తీసేందుకు అవసరమైన ముడి సరుకులను తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కేరళ నుంచి కొబ్బరి, వనపర్తి నుంచి పల్లీలు, తాండూరు నుంచి కుసుమ, నిజామాబాద్ నుంచి నువ్వులు, కర్ణాటక నుంచి ఎర్రి నువ్వులు దిగుమతి చేసుకుంటున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

విదేశాలకు ఎగుమతి

గానుగ ద్వారా తీసిన వివిధ రకాల నూనెలను మొదట శ్రీనివాస్ స్థానికంగా విక్రయించారు.తక్కువ కాలంలోనే ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా, దుబాయ్, జర్మనీ వంటి దేశాలకు ఆర్డర్లపై గానుగ నూనె సరఫరా చేస్తున్నారు. రకాన్ని బట్టి కిలో నూనెకు రూ.300 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారు. ఖర్చులు పోను కిలో నూనెకు కేవలం రూ.20 లాభం మాత్రమే తీసుకుంటున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. గానుగ నూనె తీసిన తర్వాత వచ్చే పిప్పిని పశువుల దాణా కోసం కిలోకు రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు.

అందరికీ అందుబాటులోకి..



అనారోగ్యంతో ఆస్పత్రి పాలై వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు చేశా. కల్తీ నూనెల కారణంగానే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసి ఎద్దు గానుగ నూనె కేంద్రం పెట్టాలనే ఆలోచన వచ్చింది. మొదట్లో మా కుటుంబం వరకే గానుగ నూనె తయారు చేయాలనుకుని ప్రారంభించాం. ప్రజల నుంచి డిమాండ్ పెరగడంతో అందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నాం. ఇప్పుడు విదేశాలకు ఎగమతి చేసే స్థాయికి ఎదగటం సంతోషంగా ఉంది.

– కీర్తి శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి గ్రామం, కేతేపల్లి మండలం

రైతు డబ్బులు దొంగిలించిన నిందితుల అరెస్ట్

- రూ.1.70లక్షల నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

కోదాడరూరల్, అనంతగిరి: రైతును అడ్డగించి నగదు దొంగిలించిన నిందితులను శనివారం అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ కేసు వివరాలను కోదాడ సర్కిల్ కార్యాలయంలో కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం గొండ్రియాలకు చెందిన రైతు కొండబాల పుల్లయ్య ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన వ్యాపారికి ధాన్యం విక్రయించాడు. ఆ ధాన్యం డబ్బులను రూ.1,77,817 ఈ నెల 18న తీసుకొని టీవీఎస్ ఎక్సెల్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోకి రాగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం కేంద్రానికి చెందిన ఉప్పతల అశోక్‌కుమార్, షేక్ నవాబ్ షరీఫ్, దేవాల్ల రాజా రైతును అడ్డగించి అతడి వద్ద ఉన్న నగదును దొంగిలించి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. స్కూటీపై వస్తున్న అశోక్‌కుమార్, నవాబ్ షరీఫ్, రాజా అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. చేసిన నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.70 లక్షల నగదు, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది వీరబాబు, ఏడుకొండలు, నర్సింహారావును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

కుంభమేళాకు వెళ్లొస్తుండగా..

- ప్రమాదంలో చాడ గ్రామస్తులకు గాయాలు

మోటకొండూర్: మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన 11మంది శివభక్తులు గత సోమవారం తుఫాన్ వాహనంలో కుంభమేళాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం రాత్రి నిర్మల్ దగ్గర వారి వాహనాన్ని డీసీఎం ఢీకొట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన గట్టయ్య, ఎల్లయ్య, మధుకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

త్రిపురారం : మహిళతో గొడవ కారణంగా మనస్తాపానికి గురైన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిడమనూరు మండలం కుంటిగొర్లగూడెంలో శనివారం జరిగింది. నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటిగొర్లగూడేనికి చెందిన కుంటిగొర్ల ఎల్లయ్య(60) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోని మరికొందరు గొర్రెల కాపరులతో కలిసి పక్కనే వెంగన్నగూడెం గ్రామ శివారులో ఓ రైతు తోటను కౌలుకు తీసుకొని గొర్రెలను మేపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. శుక్రవారం పని నిమిత్తం కుంటిగొర్లగూడేనికి వచ్చిన ఎల్లయ్యకు గ్రామంలోని ఓ మహిళతో గొడవ జరిగింది. ఈ క్రమంలో సదరు మహిళ పరుష పదజాలంతో ఎల్లయ్యను దూషించింది. దీంతో మనస్తాపానికి గురైన ఎల్లయ్య వెంగన్నగూడెంలో కౌలుకు తీసుకున్న తోట సమీపంలో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం అటుగా వెళ్తున్న రైతులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



లలిత మృతదేహం


వేములపల్లి (మాడ్గులపల్లి): కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన కోరె లలిత(47) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో విసుగు చెంది ఈ నెల 10వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి వెంటనే ఆమెను నల్లగొండలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లలిత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతురాలికి భర్త దేవేందర్‌తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి పెద్ద కుమారుడు కోరె రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ కొట్టేసి.. నగదు కాజేసి

- గూగుల్ పే ద్వారా రూ.99వేలు నొక్కేసిన దుండగులు

చౌటుప్పల్: బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి సెల్‌ఫోన్ కొట్టేసిన గుర్తుతెలియని దుండగులు అతని గూగుల్ పే ఖాతా నుంచి నగదు కాజేశారు. శనివారం సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడుకు చెందిన ఏలె లక్ష్మీనారాయణ పని నిమిత్తం ఈ నెల 1వ తేదీన చౌటుప్పల్‌కు వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం సొంతూరుకు వెళ్లేందుకు చౌటుప్పల్ బస్టాండ్‌కు చేరుకొని మునుగోడుకు వెళ్లే బస్సు ఎక్కాడు. బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అతడి జేబులోని సెల్‌ఫోన్‌ను కొట్టేశారు. కొంతసేపటి తర్వాత చూసుకున్న లక్ష్మీనారాయణ తోటి ప్రయాణికుడి ఫోన్ నుంచి తన సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఫోన్‌లో కెనరా బ్యాంకు అకౌంట్‌తో ఫోన్ పే, గూగుల్ పే లింక్ అయ్యి ఉండడంతో మునుగోడుకు చేరుకున్నాక అకౌంట్‌ను బ్లాక్ చేయించేందుకు బ్యాంకుకు వెళ్లాడు. అయితే అప్పటికే అతడి ఖాతా నుంచి రూ.99వేలు గూగుల్ పే ద్వారా దుండగులు నొక్కేశారు. వెంటనే అతడు 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైం సమాచారం అందించాడు. శనివారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అస్వస్థతకు గురై ఉపాధి హామీ కూలీ మృతి



నర్సమ్మ మృతదేహం వద్ద కూలీలు

వేములపల్లి(మాడ్గులపల్లి): అస్వస్థతకు గురై ఉపాధి హామీ కూలీ మృతిచెందింది. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పూసలపాడు గ్రామానికి చెందిన సుద్దాల నర్సమ్మ(62) శనివారం ఉదయం ఉపాధి హామీ పథకంలో భాగంగా మట్టి రోడ్డు పనులు చేసేందుకు వెళ్లింది. పనిచేస్తున్న క్రమంలో నర్సమ్మ ఒక్కసారిగా అస్వస్థతకు గురై కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. నర్సమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో 17 గొర్రెలు మృతి

బీబీనగర్: కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 17 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. రాఘవాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి తెల్జూరి నరసింహ శుక్రవారం రాత్రి తన దొడ్డిలో గొర్రెలను తోలి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా.. 17 గొర్రెలు మృతిచెంది కనిపించాయి. కుక్కలు దాడి చేయడంతో గొర్రెలు మృతిచెందాయని, మృతిచెందిన గొర్రెల విలువ రూ.1.70లక్షలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

ఆస్పత్రిలోని ఫార్మసీపై కేసు నమోదు

- అధిక ధరలకు మందులు విక్రయిస్తుండటంతో చర్యలు

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని లీలావతి హాస్పిటల్ పరిధిలో గల అనిల్ ఫార్మసీపై కేసు నమోదు చేసినట్లు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాహాసన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసీలో ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా మందులు విక్రయిస్తుండటంతో పాటు తప్పుడు ప్రచారాలతో డయాబెటిక్, ఆయుర్వేదిక్ మందులు విక్రయిస్తున్నందున కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయుర్వేదిక్ మందులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి. సురేందర్, కొత్తగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. సంపత్‌కుమార్, నిర్మల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అడ్డగూడూరు: బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం అడ్డగూడూరు పోలీసులు పట్టుకున్నారు. అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి చిర్రగూడూరు గ్రామానికి చెందిన శీల మహేందర్, గూడ మహేష్ ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



కలెక్టర్, డీసీపీతో మాట్లాడుతున్న సీఎం సెక్యూరిటీ వింగ్ అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య స్వర్ణ విమాన గోపుర కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. శనివారం సీఎం సెక్యూరిటీ వింగ్ అధికారులు, రాచకొండ సీపీ సుధీర్‌బాబుతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు ఉన్నతాధికారులు, ఆలయాధికారులు, వివిధ శాఖల అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. వనమామలై రామానుజ జీయర్ స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో బంగారు తాపడం చేసిన దివ్య విమాన గోపురాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం ఉచిత బస్సులను కొండ పైకి నడిపిస్తామన్నారు. పార్కింగ్ సమస్య రాకుండా పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమీక్షలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ఈఓ భాస్కర్‌రావు, సీఎం సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు, ఆలయ అధికారులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం కల్పవృక్ష వాహన సేవ, నరసింహ ఇష్టి హవనం, పల్లకీ సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని భీమవరం గోవిందపురం పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని సందర్శించుకుని సింహాచలం వరాహ నర్సింహస్వామి పట్టువస్త్రాలు, శేషమాల చందనమును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మంటల్లో కారు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన కారు

మునగాల: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. ఈ ఘటన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు కారులో ఇద్దరు వెళ్తుండగా.. మునగాల మండలం ఆకుమపాముల శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగాయి. కారులో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు గమనించి కారు దిగి బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో బోల్తా..

కారు దగ్ధమైన ప్రాంతానికి కూతవేటు దూరంలో సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. హైవే సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ట్రాలీ ఆటోను రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

'కిలిమంజారో' అధిరోహించిన మంగళపల్లి వాసి



కిలిమంజారో పర్వతంపై శ్రీహర్ష

నకిరేకల్: నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామ పంచాయతీకి చెందిన శ్రీహర్ష టాంజానియా దేశంలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. శ్రీహర్ష హైదరాబాద్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాలన్న తన కలను ఈ నెల 11వ తేదీన నెరవేర్చుకుంది. శ్రీహర్షను మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత 20వ తేదీన ఇంటికి పిలిపించుకుని అభినందించారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి సొంత గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు.

పోలీస్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- సూర్యాపేట జిల్లాలో నకిలీ డీఎస్పీ ఉదంతం వెలుగులోకి..
- ఏపీకి చెందిన మహిళ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు

సూర్యాపేటటౌన్: ఎస్ఐ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని బురిడీ కొట్టించిన నకిలీ డీఎస్పీ ఉదంతం సూర్యాపేట జిల్లాలో శనివారం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా ఆ వ్యక్తి ఇన్నోవా కారులో తిరుగుతూ తాను డీఎస్పీ అని చెప్పుకుంటూ ఏపీలోని గుంటూరు జిల్లాతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పరిచయాలు పెంచుకున్నాడు. ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద పలుకుబడి ఉన్నట్లు నటించి పోలీసు శాఖలో ఉద్యోగాలు, పెట్రోల్ బంక్‌లకు పర్మిషన్లు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఏపీకి చెందిన ఒక మహిళకు ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమె నుంచి రూ.32 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. ఉద్యోగం రాకపోవడతో మోసపోయినట్లు గ్రహించిన సదరు మహిళ ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అతడిపై ఒత్తిడి చేసింది. దీంతో అతడు కొంతకాలంగా పరారీలో ఉన్నాడు. మోసపోయిన మహిళ మఠంపల్లి పోలీసులను ఆశ్రయించింది. మొబైల్ సిగ్నల్ ట్రాకింగ్ ద్వారా నిందితుడు సూర్యాపేట ప్రాంతంలోనే తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. కాగా గుంటూరు నకిలీ డీఎస్పీపై గతంలో చీటింగ్ కేసు నమోదైనట్లు సమాచారం. ఈ విషయమై సూర్యాపేట పోలీసులను వివరణ కోరగా కేసును విచారిస్తున్నామని, త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

చీరకట్టు.. అదిరేట్టు



భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జేవీ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినులు చీరకట్టులో హాజరై సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు. – భూదాన్‌పోచంపల్లి